క్లుప్తంగా

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ



ఉత్సవమూర్తులను పల్లకీ సేవకు సిద్ధం చేస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. ప్రతి సోమవారం రాత్రి స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగిస్తారు. ఈ క్రమంలోనే ఉత్సవమూర్తులను పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ మాడ వీధులలో ఊరేగించారు.

లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించండి

ఓబులవారిపల్లె : మంగంపేట ఆర్‌ఆర్ – 5 కాపుపల్లెకు సంబంధించి ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించాలని వైఎస్సార్ ఆర్‌ఆర్ – 5 ప్రజాసంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించినట్లుగా లాటరీ ద్వారా రెవెన్యూ అధికారులు ప్లాట్లను కేటాయించాలన్నారు. ఆలస్యం చేయడం ద్వారా గ్రామ ప్రజలకు అందాల్సిన పరిహారం కూడా ఆలస్యం అవుతుందని, వెంటనే ఏపీఎండీసీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి ప్లాట్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంక్షేమ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూస్తామన్నారు. అలాగే అన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ సౌమిత్రి, కౌన్సిలర్ న్యామతుల్లా, కసిరెడ్డి రాజారెడ్డి, అబ్దుల్ మునాఫ్, గోవిందు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో రేణుకా మారెమ్మ

రాజంపేట టౌన్ : మండలంలోని సింగనవారిపల్లెలో వెలసిన రేణుకా మారెమ్మకు సోమవారం భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే పూజా కార్యక్రమాలను జరిపారు. అలాగే అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అమ్మవారు సింగనవారిపల్లె గ్రామంతోపాటు గొందివారిపల్లె, కొమ్మివారిపల్లె గ్రామస్తులకు గ్రామదేవత కావడంతో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేయించారు.

ఎడతెరిపిలేని వాన



సంబేపల్లె మండలంలో కురుస్తున్న వర్షం

సంబేపల్లె : మిచాంగ్ తుపాను వలన మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. అధికారులు అప్రమత్తమై ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమకు తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరుతున్నారు. వర్షంతో పాటు చల్లగాలులు తోడుకావడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు.

సామాజిక పింఛన్‌లు పెంచాలి

రామాపురం : పింఛన్లకు అందజేసే నగదును పెంచాలని పీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర కోరారు. ఈ మేరకు మహిళా కార్యకర్తలతో కలిసి ఆమె సంబంధిత వినతిపత్రాన్ని నల్లగుట్టపల్లె, బయారెడ్డిగారిపల్లె సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ. 6వేలు, దివ్యాంగులకు రూ.7వేలు పింఛన్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకురాలు సుబ్బమ్మ, లక్ష్మీదేవి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘మిచాంగ్’ను ఎదుర్కొనేందుకు అన్ని విధాల సిద్ధం

- 24 గంటలు ప్రజలకు అందుబాటులో
- అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధం
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: బాలపల్లె వద్ద జేసీబీతో పనులు చేయిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : మిచాంగ్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం రైల్వేకోడూరులో ఈదురు గాలుల తీవ్రత అధికమైంది. మండలంలోని శాంతినగర్ వద్ద గుంజన నది, మేకలేరు, చిట్వేలి రోడ్డులోని గుంజనేరులను కొరముట్ల పరిశీలించారు. సోమవారం బాలపల్లె సమీపంలోని ప్రధాన రహదారిపై కొండచరియల నుంచి నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడతుండటంతో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు జోరువానను సైతం లెక్కచేయకుండా జేసీబీ సహాయంతో దగ్గరుండి నీటిని శేషాచలం అడవుల్లోకి మళ్లించారు. దీంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని అవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావద్దని సూచించారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావసం ఏర్పాటు చేసి వారికి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. వర్షం తగ్గిన వెంటనే పంట నష్టంపై అంచనా వేయాలని అధికారులకు ఆదేశించారు. తిరుమల గోకులం డ్యామ్ గేట్లు ఎత్తడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంత ప్రజలు హెచ్‌ఎమ్‌ఎమ్ హైస్కూల్‌లో ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజల కోసం శిబిరాలు ఏర్పాటుచేసి అక్కడ ఆహారం, మందుల సరఫరా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషాతో ఫోన్‌లో మాట్లాడి రైల్వేకోడూరు నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో ప్రజలు, రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అలాగే అనంతరాజుపేట ఫారం ఎస్టీ కాలనీవాసులు గుంజననది సమీపంలో ఉండంతో ముందస్తు చర్యలుగా కాలనీవాసులను ఆగ్రోస్‌సంస్థ వారి అప్సా జ్యూస్ ఫ్యాక్టరీలో వారికి సౌకర్యం కల్పించడంతోపాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తుపాను వలన విద్యుత్, రవాణా వ్యవస్థ దెబ్బతింటే యుద్ధ ప్రాతిపదికన వాటిని పునరుద్ధరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఎప్పటికప్పుడు మిచాంగ్ కారణంగా ప్రజలు ఇబ్బందిపడకుండా తమవంతుగా సహాయచర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మొబైల్ నంబర్ 77999 93456, 94404 19305 లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, తహసీల్దారు రామ్మోహన్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మిచాంగ్ తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. సోమవారం వీఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పూరి గుడిసెలో ఉండేవారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వలంటీరు, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు. రైతులు సాగుచేసిన పంటలకు నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వీఆర్‌ఓలు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్, వీఆర్‌ఓలు మల్లికార్జున, ధనమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంపై అప్రమత్తం

వీరబల్లి(రాజంపేట) : మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావంపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంతోపాటు సచివాలయంలో కూడా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారన్నారు. కంట్రోల్ రూం ఆపరేటర్‌గా సురేంద్రను నియమించామన్నారు. 8008989060, 81848 15080 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా పంచాయతీలో మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల నష్టపోయినా, ఆపదలో ఉన్న వెంటనే కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు. నీటి నిల్వ అంటువ్యాధులు రాకుండా ముందుగానే వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ వ్యవస్థలు అప్రమత్తం కావాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



వీరబల్లెలో అలర్ట్ మీట్ నిర్వహించిన ఎంపీడీఓ



పుల్లంపేట: వీఆర్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ నరసింహకుమార్

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

గాలివీడు : మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్‌లు ఖాదర్‌మొహిద్దీన్, వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, సర్పంచ్ జానకీ రామాంజులురెడ్డిలు అన్నారు. సోమవారం గరుగుపల్లె సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సచివాలయంలో పథకాలకు సంబంధించిన బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం లేకుండా సంక్షేమం, అభివృద్ధితో ఆదర్శ రాష్ట్రంగా పాలన సాగిస్తున్నారని, తిరిగి ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ



వానలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రాజంపేట రూరల్ : శైవ క్షేత్రం అత్తిరాలలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై త్రైతేశ్వరుడికి పూజలు నిర్వహించారు. సాయంత్రం జోరువానను సైతం లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. త్రేతేశ్వరుని పాదాల చెంత ఉన్న బహుదానదికి ఇచ్చిన గంగ హారతి వలన నేడు ఈ పరిసర ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయని గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

న్యాయమూర్తి చొరవతో సమస్యల పరిష్కారం

నందలూరు(రాజంపేట) : మండల లీగల సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జీ కె.లత చొరవతో విద్యార్థుల సమస్యలకు పరిష్కారం లభించింది. నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆడపూరు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను జడ్జీ ఆకస్మికంగా తనిఖీ చేసి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసి వారం రోజులలో సమస్యలకు పరిష్కారం చూపాలని గడువు ఇచ్చారు. దీనిపై సోమవారం అధికారులు కోర్టులో హాజరై నివేదికను అందజేశారు. అందులో ముఖ్యంగా అన్నమయ్య జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య మూడు మండలాలలోని హాస్టల్‌లో ఒక డాక్టర్‌ను నియమించినట్లు నివేదిక ఇచ్చారు. ఆ డాక్టర్ వారానికి రెండుసార్లు ప్రతి హాస్టల్‌కు వెళ్లి పిల్లలను పరీక్షించి ఆరోగ్య సమస్యలకు వైద్యం అందజేస్తారని తెలియజేశారు. సదరు పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ సుకన్య ఇచ్చిన నివేదికలో కాంట్రాక్ట్ లేబర్స్ ఇద్దరిని అపాయింట్ చేశామని స్కూల్‌లో ఇకపై ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకుంటామని తెలిపారు. కాంట్రాక్టర్ హాజరై ప్రతినెల 2వ తేదీ కల్లా సరుకులు అందజేస్తానని తెలిపారు. అలానే స్కూళ్లలో సిక్ రూమ్‌లో రెండు మంచాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గ్రామస్థాయి నుంచి ఉద్యమం



కరపత్రాలను విడుదల చేస్తున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : ప్రజల ఆస్తులకు భద్రతలేని భూ హక్కు చట్టం – 2023కి వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని చేపడతామని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కడప – అన్నమయ్య జిల్లాల నేతలు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద భూ హక్కుల చట్టం వలన ప్రజలకు కలిగే నష్టాలను వివరించి వారిని చైతన్య పరచడానికి ఐఏఎల్ ఆధ్వర్యంలో ముద్రించిన 10వేల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ కడప – అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, పౌరహక్కుల సంఘం న్యాయవాది రెడ్డెయ్యలు మాట్లాడుతూ త్వరలో అమలులోకి రానున్న భూ హక్కుల చట్టం కబ్జాదారులకు వరంగా మారనుందని, ఈ చట్టం అమలులోకి రాకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చట్టం అమలులోకి వస్తే భూ ఆధారిత కేసులను విచారించే అర్హతను ప్రస్తుతం ఉన్న కోర్టులు కోల్పోతాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ట్రిబ్యునల్స్‌లోనే విచారణ జరుగుతాయన్నారు. దీంతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్, ఆనందకుమార్, నాగముని, ఖాదర్‌బాషా, నాగేశ్వరరావు, కృష్ణయ్య, ధనుంజయ, దేవేందర్‌రెడ్డి, టి.వి.రమణ, హుమయూన్ బాషా, ఆదిరెడ్డినాయక్, ఎం.రవి శంకర్, బి.వి.రమణతోపాటు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని గ్రామాలలో సమస్యలు ఉంటే సత్వరం పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయారావు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాల సమస్యలు ఏవైనా ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని రైతులు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

రైతును రాజుగా చూడాలన్నదే సీఎం ఆశయం



లక్కిరెడ్డిపల్లె: కోనంపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : రైతును రాజుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం కోనంపేట గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ హాజరయ్యారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు, జగనన్న సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను సచివాలయ సిబ్బంది వివరించారు. సంక్షేమ బోర్డును స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులకు డీకేటీ పట్టాలు ఇచ్చి కనీసం అమ్ముకునే పరిస్థితి కూడా లేనటువంటి భూములకు హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చేస్తున్నటువంటి సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే రాయచోటి ఎమ్మెల్యేగా గడికోట శ్రీకాంత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండా ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, రవిరాజు, లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని రెడ్డి, మాసూల్ సాబ్, వెంకటరామిరెడ్డి, అలీబాషా, పురుషోత్తం, రాఘవరెడ్డి, కుళ్లాయప్ప, నరసింహారెడ్డి, ఖాజా, కార్తీక్, గంగిరెడ్డి, ఖాదర్ వలి, సభాపతి, వెంకటరమణ, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ ఏజాస్ అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహ్మద్, జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్పలు హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకునేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పద్మావతి, కో-ఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు యహియాఖాన్, ఖదీర్, సారుల్లా, సుగతుల్లాఖాన్, అబ్రు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తోందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లి పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డితో కలిసి నిర్వహించారు. గ్రామాలను కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి నడిపిస్తున్నారన్నారు. పలు సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వి.వెంకటరమణారెడ్డి, వాసుదేవరెడ్డి, ఈఓపీఆర్‌డీ రవీంద్రనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంబేపల్లె: వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసిన మండల నాయకులు, కార్యకర్తలు



చిన్నమండెం: సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లె గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ నాయకులు జ్యోతి చిన్నయ్య అన్నారు. సోమవారం సీపీఐ నాయకులు ముక్కవారిపల్లె గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్కావారిపల్లె గురుకుల పాఠశాలకు ఉమ్మడి రాష్ట్రంలోనే మంచి పేరు, గుర్తింపు ఉండేదని, ఇక్కడ చదువుకున్న వారు ప్రస్తుతం అత్యున్నత స్థానాలలో ఉన్నారన్నారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో పారిశుద్ధ్యం తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున సమస్యలు పరిష్కరించి గురుకుల పాఠశాలకు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్లతో నందలూరు అభివృద్ధి



అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : నందలూరు అభివృద్ధికి కేంద్రం రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీపీ చాంబరులో వివిధ విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించామన్నారు. పంచాయతీ రాజ్ కింద రూ.1,15,41,000లతో రోడ్లు, భవనాలను నిర్మిస్తామన్నారు. జూనియర్ కళాశాలకు రూ.65 లక్షలు నిధులు, అనంతపురమ్మ ఆలయ సమీపంలో వైఎస్సార్ పార్కును రూ.40 లక్షలతో పనులు చేపడుతామని పేర్కొన్నారు. ఇందుకు జిల్లా కలెక్టరు అనుమతి కూడా లభించిందన్నారు. అలానే మండలంలో తాగునీటి అవసరాల నిమత్తం రూ.3,09,30,000 నిధులు కేటాయించామన్నారు. వీటన్నింటికి ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో అనుమతులు లభించాయన్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్వేషణ జరుగుతోందన్నారు. భూ దాతలు ముందుకొస్తే వారి పేరును ఆసుపత్రికి పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలీం, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి డీఈ రవి, ఎంపీడీఓ సౌభాగ్య, అన్నం నాగేంద్ర, భాస్కర్, ఎండీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను సుందరంగా అలంకరించారు. అర్చకులు పూజాది క్రతువులను నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్లలోని వెంకట శివసాయి ఆలయం, పసుపతినాథ ఆలయం, చిన్న జంగంపల్లె మల్లన్న ఆలయాలతోపాటు పలు శివాలయాలలో పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. పవిత్రమైన కార్తీక మాసంలో శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించడం వలన తమ కష్టాలు తొలగిపోవడంతోపాటు పరమ శివుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తాడని భక్తుల నమ్మకం.



సంబేపల్లె: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రామాపురం: హరిహరాలయంలో పూజలందుకుంటున్న హరిహరులు

రామాపురం : పవిత్ర కార్తీక మాసం 3వ సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అలాగే ఆలయాలలో ఉదయం నుంచే అభిషేకాలు, పూజలు జరిపారు, లింగాష్టకం, శివ సోత్రాలను పఠించారు. అనంతరం తీర్థప్రసాదాల స్వీకరించారు. మండలంలోని హసనాపురం శివాలయం, హరిహరాలయం, ఘాట్ రోడ్డులోని భవానీ శంకర్ ఆలయం, కల్పనాయుని చెరువు ఆలయంలో పూజలలో భక్తులు పాల్గొన్నారు.

సిద్దవటం : సిద్దవటం గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన కపర్థీశ్వర స్వామి ఆలయంలో మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల ఉత్సవమూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో కల్యాణం వైభవోపేతంగా జరిగింది. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. కల్యాణంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తదుపరి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



పూజలలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

ఓబులవారిపల్లె : మండలంలోని పెద్దఓరంపాడులోని గౌరీ శంకర సిద్దేశ్వరస్వామిని సోమవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దర్శించుకున్నారు. కార్తీక సోమవారం కావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. పూజారులు ఆలయ మర్యాదలతో ఆకేపాటికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలి మురళీమోహన్ రెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, శంకర్, శ్రీను, కళ్యాణ్, హరి బాబు పాల్గొన్నారు.

చిట్వేలి : మండల కేంద్రంలోని శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం శ్యామలాంబ అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ వందలాది మంది మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



చిట్వేలి: శాకాంబరిగా శ్యామలాంబ అమ్మవారు

రాయచోటి టౌన్ : కార్తీక మూడవ సోమవారం సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన అఘోరలింగేశ్వరుడికి విశేష పూజలు జరిపారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, ఆభరణాలతో అలంకరించారు. అంతకుముందు స్వామి వారికి మహిళలు దీపాలతో హారతులు పట్టారు. అనంతరం ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో మంగళహారతులు, తీర్థ ప్రసాదాలు అందించారు. దాతలు మంజుల, మల్లికార్జున, హంసబావి సహకారంతో అన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాయచోటి టౌన్: అలంకరణలో అఘోరలింగేశ్వరుడు



చిన్నమండెం : దర్శనమిస్తున్న శివలింగస్వరూపుడు



ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం